కథ

# ఎమోషనల్ డిపాజిట్స్

- వేమూరి ఉషాకుమారి

**"అమ్మా!** కొంచెం ఈనాడు, హిందూ పేపర్లు తెచ్చిపెడ్తావా?" అని రమని అడిగాడు మూర్తి. "ఆయన ఆఫీసుకి తీసుకెళ్ళారు మామయ్యగారూ" అని జవాబిచ్చింది రమ. సరిపోయింది, ఇంక ఈరోజంతా ఎట్లా గడపాలో అని నిట్టూర్చాడు మూర్తి.

ఈ మధ్య లలిత చాలాసార్లు గుర్తుకొస్తోంది మూర్తికి. లలిత పోయి అప్పుడే రెండు సంవత్సరాలు గడిచింది. మనుషుల విలువ వాళ్లుపోయాక తెలుస్తుందంటారు, ఇదేనేమో. లలిత బతికి ఉన్నప్పుడు ఎప్పుడూతను ఆవిడను పట్టించుకున్నదిలేదు. తనే మూర్తి అవసరాలు కనిపెడ్తూ, ఏంకావాలో అడగక ముందరే అమర్చి పెట్టేది. ఇంటి బాధ్యతంతా తన ముందు చూపుతో, తెలివితేటలతో చాలా సమర్థవంతంగా నడిపింది. తనని, కొడుకు సురేష్‌ని కంటికి రెప్పలా చూసుకుంది.

తనకి జ్ఞాపకం..... తను డబ్బు సంపాదనలోపడి భార్యను, పిల్లవాడిని పెద్దగా పట్టించుకున్నది లేదు. ఎప్పుడూ తన ఉద్యోగం, తన వ్యాపకాలు, తన సోషల్ లైఫ్, పేరు, డబ్బు కోసం వెంపర్లాట. లలిత సురేష్‌కి తల్లితండ్రి తనే అయ్యి పెంచింది. తనకి లలిత మీద చాలా కోపం వస్తూ వుండేది. "ఏమిటి వాడ్ని గురించి అంత తపన పడ్తావు? నీకు నాకంటే వాడే ఎక్కువా?" అని. నవ్వేసి తను ఊరుకునేది. సురేష్ చిన్నప్పుడు ఒకసారి ఉత్సాహంగా తన దగ్గిరికి పరుగున వచ్చి "నాన్నగారు! ఈరోజు మా స్కూల్లో నేను వక్తృత్వ పోటీలో, బాడ్మింటన్‌లో పాల్గొంటున్నాను. మీరు తప్పకుండా రావాలి" అని ఎంతో ఆశగా అడిగాడు. "లేదురా, నాకు వీలవదు. ఈ రోజు నాకు చాలా ముఖ్యమైన పన్లున్నాయి. నేను రాలేను" అని వాడి పసి మనస్సును చాలా గాయపరిచాను. వాడు ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు. వాడి మనస్సెంత గాయపడి వుంటుందో అని ఇప్పుడనిపిస్తోంది.

ఇంకొకసారి తన స్నేహితుడు ఒక పెద్ద హోటల్లో పార్టీ యిస్తుంటే అందర్నీ కుటుంబ సమేతంగా రమ్మని ఆహ్వానించాడు. ఆరోజు సురేష్‌కి 102$^0$ జ్వరం. లలిత ససేమిరా రానంది. తన స్నేహితుడు చాలా బిగ్‌షాట్. వాడితో తనకు ముందు ముందు చాలా ఉపయోగాలుంటాయి. వాడు తను రాలేదంటే ఏమైనా అనుకుని తనకి చెయ్యాల్సిన ఫేవర్స్ చేయడేమో అని తన అనుమానం. లలితని తొందరచేశాడు తయారవమని. లలిత ఆశ్చర్యపోయింది. పిల్లవాడ్ని జ్వరంతో వదిలేసి పార్టీలు ఏమిటంది. తను ససేమిరా వీల్లేదన్నాడు. కొద్దిసేపే కదా వాడు రెస్ట్ తీసుకుంటాడు. రెండు మూడు గంటల్లో వచ్చేద్దాం రమ్మన్నాడు. ఆరోజు వాడు తనని చూసిన చూపు యిప్పుడు తనని గుండెల్లో గుచ్చుతోంది. లలిత ఎటూ చెప్పలేక సతమతమయ్యింది. చివరికి మూర్తి ఒక్కడే వెళ్ళాల్సి వచ్చింది. దానికి తను లలితను చాలా రోజులు సతాయించాడు. నీకు భర్తకన్నా కొడుకే ముఖ్యం అనీ, తను ఎందరికో పార్టీలో సంజాయిషీ యివ్వాల్సి వచ్చింది అని.

> **తనకి జ్ఞాపకం తను డబ్బు సంపాదనలోపడి భార్యను, పిల్లవాడిని పెద్దగా పట్టించుకున్నది లేదు. ఎప్పుడూ తన ఉద్యోగం, తన వ్యాపకాలు, తన సోషల్ లైఫ్, పేరు డబ్బు కోసం వెంపర్లాట.**

ఇలా లెక్కలేనన్ని సందర్భాలు తను తన కుటుంబానికి అవసరమొచ్చినప్పుడు దొరకకపోవడం... సురేష్ ఎదిగేకొద్దీ తండ్రి నుంచి మానసికంగా దూరం జరగడం మొదలైంది. ఒకటే ఇంట్లో వుంటూ ఎవరి గదుల్లో వాళ్ళు. ఇద్దరి మధ్య వారధిలా లలిత. తన దూకుడు స్వభావంతో మూర్తి తన మాట నెగ్గించుకోవాలని, తను చెప్పినట్లు యింట్లో బయట అందరూ నడుచుకోవాలన్నట్టు ప్రవర్తించేవాడు. పాతికేళ్ళల్లో కష్టపడి చాలా డబ్బు

**తన సంపాదన తమకి చాలని, భార్య ఉద్యోగం తనకవసరం లేదని తేల్చిచెప్పాడు. ఇంటికి రాగానే నీకోసం ఒకరు ఎదురు చూస్తున్నారనే ఫీలింగ్ నాకు ఎంతో ఆనందాన్నిస్తుంది. అది మీకు చెప్పినా అర్థంకాదు.**

సంపాదించాడు. సంఘంలో పేరు, డబ్బుతో వచ్చే హంగులు, మొహమాటపు సంబంధాలు అన్నీ సమకూరాయి. పెద్ద బంగళా, 2 కార్లు, బ్యాంక్ డిపాజిట్లు సురేష్ కోసం సంపాదించి పెట్టాడు.

పదేళ్ళ క్రితం అనుకుంటాను, అమ్మకి వంట్లో బాగాలేదని ఉత్తరం వచ్చింది. తనకి ఆఫీసు పనిమీద దుబాయి వెళ్ళే అవకాశం వచ్చింది. అమ్మని చూడటానికి విశాఖ వెళ్తే కనీసం 4రోజులు కేటాయించాలి. తిరిగి వచ్చాక వెళ్ళొచ్చని లలితని పంపించాడు. లలిత, సురేష్ వెళ్ళారు. తను రాలేదని తల్లి చాలాసార్లు అడిగిందట. దుబాయి నుంచి ఒక కాన్ఫరెన్స్‌కి అమెరికా వెళ్ళి అక్కడ 3,4 దేశాల డెలిగేట్స్‌తో చర్చలు జరిపి రావటానికి నిశ్చయమై అటే అమెరికా వెళ్ళిపోయాడు మూర్తి.... అక్కడ అమ్మపోయినట్టు కబురొచ్చింది. ఒక్క నిముషం బుర్రంతా బ్లాంకైపోయింది. తన పని సగంలో వుంది. తన కోసం నలుగురు మానేజర్లు ఎదురుచూస్తున్నారు. తను యిప్పుడు ఇండియా వెళ్తే కనీసం 10 రోజులు పడ్తుంది. కంపెనీ తన గురించి ఏమను కుంటుందో అని ఆలోచించి, కొంచెం బాధగానే అన్నయ్యకి ఫోన్ చేసి తన అశక్తతని తెలియజేసి, సాధ్యమయినంత తొందరలో వస్తానని చెప్పాడు. లలిత చాలా బాధపడింది. సొంత తల్లి చివరి చూపుకి కూడా నోచుకోలేక పోయాడని సురేష్ మాత్రం తండ్రిని క్షమించలేకపోయాడు. 17,18 ఏళ్ళ వయస్సులో తండ్రి అంటే ఒకలాంటి భావం. మానవ సంబంధాలకి ఆయనిచ్చే విలువ, తన బాగుకోసం అయిన వాళ్ళని పక్కకు నెట్టి ముందుకు దూసుకెళ్ళే తత్వం జీర్ణం కాలేదు. తల్లితో తన భావాలు పంచుకుంటే ఆవిడ భర్తని సమర్థించింది తప్ప తన ఆలోచనల్ని అర్థం చేసుకో లేదు. ఆవిడకు యిద్దరూ సమానమే మరి. కాని సురేష్‌కి ఆ వయస్సులో తండ్రి మానసికంగా యింకా దూరమయ్యాడు. *తండ్రి అంటే ఒక సంపాదించే యంత్రం అనీ, ప్రేమ, ఆప్యాయత తను అందరి దగ్గరా తీసుకోవడమే గాని తను ఎవ్వరికీ పంచలేని అతి పేదవాడని అర్థమయ్యింది.*

సురేష్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఒక మల్టీనేషనల్ కంపెనీలో చేరటం, రమతో పెళ్ళి అన్నీ వేగంగా జరిగిపోయాయి. 4 సంబంధాలొచ్చాయి. ముగ్గురు ఉద్యోగస్తులే..... ఒక్క రమ తప్ప. సురేష్ తల్లితండ్రులకు తేల్చి చెప్పేశాడు తను బాగా చదువుకుని యింటి పట్టున ఉండే రమనే యిష్టపడ్డానని, తన సంపాదన తమకి చాలని, భార్య ఉద్యోగం తనకవసరం లేదని తేల్చిచెప్పాడు. "ఇంటికి రాగానే నీకోసం ఒకరు ఎదురు చూస్తున్నారనే ఫీలింగ్ నాకు ఎంతో ఆనందాన్నిస్తుంది. అది మీకు చెప్పినా అర్థంకాదు. నేను రమని తప్ప వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకోన"ని.... తాము వాడి మాటకి తలవంచక తప్పలేదు. రమ ఎంతో కలివిడిగా వుంటుంది. వాళ్ళిద్దరూ గంటలు, గంటలు కబుర్లు చెప్పుకుంటూ అలా రోజూ సాయంత్రం పార్కుకో, కూరగాయలకో కలసి వెళ్ళేవారు. ఏదైనా పనిమీద సురేష్ వెళ్తూ బోర్ కొట్టకుండా రమని కూడా తీసుకెళ్ళేవాడు కార్లో తనకు బోర్ కొట్టకుండా కంపెనీ కోసం కబుర్లు చెప్తుందని. వాళ్ళిద్దరినీ చూస్తే మూర్తికి వింతగా వుండేది. ఏముంటాయి అన్ని మాటలు. పనిచేసుకుని బయట ఫ్రెండ్స్‌తో గడపక ఎప్పుడూ తల్లితో, భార్యతో గడుపు తాడేమిటి? వీడికి సోషల్ లైఫ్ లేదా అని విసుక్కునేవాడు మూర్తి.

కాలచక్రం గిరగిర తిరిగి కొడుకు ఇద్దరు బిడ్డల తండ్రి కావడం, తను రిటైరవ్వడం, లలిత అనారోగ్యం, తనను ఒంటరివాడ్ని చేసి పోవడం అన్నీ గుర్తొచ్చాయి. లలిత పోయేముందు సురేష్‌కి నాన్నగారిని అప్పగించి జాగ్రత్తగా చూసుకొమ్మని చెప్పింది. తల్లికి మాటిచ్చాడు. తన వంతు బాధ్యత బాగానే నిర్వహిస్తున్నాడు. కానీ ఏదో వెలితి. మనస్సు విప్పి ఎవరూ మాట్లాడరు. అన్ని సంబంధాలు ఏవో లావాదేవీల్లాగా అనిపిస్తున్నాయి. మనవడు, మనవరాలు చక్కగా గొడవచేస్తూ ఆడు కుంటున్నా తనకి విసుగే! ఎవరి పనుల్లో వారుండి తనని బొత్తిగా ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. ఆ బాధ ఎట్లా ఉంటుందో యిప్పుడు తనకు అనుభవమవుతోంది. తన మిత్రుడు, వాకింగ్‌లో రోజు మనస్సు విప్పి మాట్లాడే రావు

అంటాడు... నువ్వదృష్టవంతుడివి అని. వడ్డించిన విస్తరి లాంటి జీవితం, ప్రయోజకుడైన కొడుకు, బాధ్యతగల కోడలు, ముత్యాల్లాంటి మనుమలు నీకేంటి అని. మూర్తికి కూడా అదే అనిపిస్తు ంది. కనీసం 40, 50 లక్షల డిపాజిట్లు, బంగళా, 4,5 స్థలాలు, యిన్ని సమకూర్చాడు దాని కోసం జీవితకాలం అంతా పాటుపడ్డాడు. యివన్నీ సురేష్ కోసమేగా. కాని వాడికెందుకో వుండాల్సిన కృతజ్ఞత, సంతోషం లేదు. డబ్బు వాడికి యివ్వాల్సిన కిక్ యివ్వట్లేదా అని....

రమకూడా ఊళ్ళో లేదు. వాళ్ళ నాన్నగారి తిథికి వాళ్ళ అన్నయ్య దగ్గరికి చెన్నై వెళ్ళింది. బొత్తిగా తోచట్లేదు. పుస్తకం చదువుదామంటే ఒక్కటే కళ్ళు మంటలు... జ్వరం వచ్చినట్లుంది. లేచి థర్మామీటర్ అందుకుని టెంపరేచర్ చూస్తే $103^0$ జ్వరం. మాట్లాడకుండా కళ్ళు మూసుకుని పడుకున్నాడు. లలిత ఉంటే ఎంత హడావిడి చేసేది. డాక్టర్‌కి ఫోన్ చేద్దామన్నా లేచే ఓపిక లేదు. మందులు వేసుకుందామంటే నీరసం కొంచెం కాఫీ తాగితే బావుండునని ఆశ. ఇన్ని ఆలోచనలతో మూలుగుతూ పడుకున్నాడు మూర్తి. గొంతు ఎండిపోయి దగ్గు తెర వచ్చి మెలకువ వచ్చింది. మంచినీళ్ళు అందుకుందామని ఒంగి కళ్ళు తిరిగి పడిపోయాడు. అలికిడికి సురేష్ వచ్చి చూసి గబగబా తండ్రిని మంచం మీదకి చేర్చి డాక్టర్‌కి ఫోన్ చేసి, మందులు వెంటనే తెచ్చి రెండు రోజులపాటు ఆఫీసుకి వెళ్ళకుండా తండ్రిని కనిపెట్టుకుని ఉన్నాడు. టెంపరేచర్ చూసి ప్రతి 8 గంటలకు మందులు వేయడం, గ్లూకోసు నీళ్ళు; కొబ్బరి నీళ్ళు యిచ్చి నిద్దరపోకుండా రాత్రంతా కనిపెట్టుకుని ఉండటం చూసి మూర్తి చాలా చలించిపోయాడు. మూడవరోజు తండ్రి కొంచెం కోలుకున్నాక ఆఫీసుకెళ్ళాడు సురేష్. మూర్తిలో అంతర్మథనం మొదలైంది. తను తన కెరీర్ కోసం మానవ సంబంధాలని పక్కకు పెడితే తన కొడుకు కెరీర్ చూసుకుంటూ రమ ఊళ్లో లేకపోయినా సెలవుపెట్టి తనని కంటికి రెప్పలా చూసుకోవడం మూర్తిని బాగా షేక్ చేసింది. గిల్టీఫీలింగ్‌తో తను ఈ ప్రేమకి అర్హుడా అని తనలో తను ప్రశ్నించుకున్నాడు....

తను సురేష్ పసితనంలో చిన్న చిన్న సరదాలు తీర్చకపోయినా, వాడు వాడి కర్తవ్య నిర్వహణలో తనవంతు బాధ్యత నూటికి నూరుపాళ్ళూ నిర్వర్తించాడు. మూర్తి తనలో తాను ప్రశ్నించుకున్నాడు.... 'తను సురేష్ కిచ్చిన ఫిక్సెడ్ డిపాజిట్ ఎక్కువ విలువైనదా? లేక వాడి మనసులోని 'ఎమోషనల్ డిపాజిట్' ఎక్కువ విలువైనదా?

గీతం

# వందేమాతరం

నూరేళ్ల గీత మిది
భారతావని దాస్యం పై
సాగించే సమరంలో
సారథిగా నిలిచింది — వందేమాతరం

బానిసత్వ బతుకుల్లో
చైతన్యం వెలిగించగ
తెల్లవాడి పాలనపై
అంకుశమై నిలిచింది — వందేమాతరం

భారతీయ నేతలంత
స్వాతంత్ర్య యోధులై
సాగించే యుద్ధంలో
జయభేరిగా నిలిచింది — వందేమాతరం

భిన్న భిన్న వాదాల
భేదాలను మరిపించి
ఒకటై నిలిచేందుకు
ఒకటిగా పోరాడే
సంఘటనను సాధించే — వందేమాతరం

తెలుగు, కన్నడ, హిందీ, బెంగాలీ
ఎన్నెన్నో భాషలున్నా
స్వాతంత్ర్య లక్ష్యంగా
సాగేటి పోరులో
ఒక్కటిగా నిలిపింది — వందేమాతరం

- మట్టెగుంట వెంకటరమణ